1. జీవమా, యెహోవా నీకుఁ - జేసిన మేళ్లన్ మరవకు = నీవు చేసిన పాతకంబులను - మన్నించి జబ్బు - లేవియున్ లేకుండఁ జేయును - ఆ కారణముచే ॥దేవ॥

2. చావు గోతినుండి నిన్ను - లేవనెత్తి దయను గృపను - జీవ కిరీటముగ వేయును - నీ శిరసుమీద జీవ కిరీటముగ వేయును - ఆ కారణముచే ॥ దేవ॥

3. యౌవనంబు పక్షిరాజు - యౌవనంబు వలెనె క్రొత్త = యౌవనంబై వెలయునట్లుగా - మే లిచ్చి నీదు-భావమును సంతుష్టిపరచునుగా - ఆ కారణముచే ॥దేవ॥

4. ప్రభువు నీతి పనులు చేయున్ - బాధితులకు న్యాయ మిచ్చున్ = విభుండు మార్గము తెలిపె, మోషేకుఁ - దన కార్యములను - విప్పె నిశ్రా యేలు జనమునకు - ఆ కారణముచే ॥దేవ॥

5. అత్యధిక ప్రేమ స్వరూపి-యైన దీర్ఘ శాంతపరుండు - నిత్యము వ్యాజ్యంబు చేయఁడు - ఆ కృపోన్నతుఁడు - నీ పయి నెపుడు కోప ముంచఁడు - ఆ కారణముచే ॥దేవ॥

6. పామరుల మని ప్రత్యుపకార - ప్రతి ఫలంబుల్ పంపలేదు = భూమి కన్న నాకసంబున్న - యెత్తుండు దైవ - ప్రేమ భక్తి జనులయందున ఆ కారణముచే ॥దేవ॥

7. పడమటికిఁ దూర్పెంత యెడమో - పాపములకును మనకు నంత = యెడము కలుగజేసియున్నాఁడు - మన పాపములను - ఎడముగానే చేసియున్నాఁడు - ఆ కారణముచే ॥దేవ॥

8. కొడుకులపైఁ దండ్రి జాలి - పడు విధముగా భక్తిపరుల = యెడల జాలి పడును దేవుండు - తన భక్తిపరుల -యెడల జాలిపడును దేవుండు - ఆ కారణముచే ॥దేవ॥

9. మనము నిర్మితమయిన రీతి- తనకుఁ దెలిసియున్న సంగతి = మనము మంటి వారమంచును - జ్ఞాపకముచేసి - కొనుచు కఱుణ జూపుచుండును ఆ కారణముచే ॥దేవ॥



10. పూసి గాలి వీవ నెగిరి - పోయి బసను దెలియని వన - వాస పుష్పము వలెనె నరుఁడుండు - నరు నాయువు తృణ - ప్రాయము మన దేవ కృప మెండు - ఆ కారణముచే ॥దేవ॥

11. పరమ దేవ నిబంధ నాజ్ఞల్ - భక్తితోఁ గైకొను జనులకు = నిరతమును గృప నిలిచి యుండును - యెహోవా నీతి-తరములు పిల్లలకు నుండును - ఆ కారణముచే ॥దేవ॥

- ముంగమూరి దేవదాసు

## 13 నీవే నా సహాయుడవు

రా - శంకరాభరణము (చాయ: మన మొదటి తలిదండ్రుల్) తా - త్రిపుట

నా కాలగతు లెవ్వి - నా చేతులను లేవు - నాదు దేవ = యెపుడు - నీకే వాని మీద - నిత్యాధికారంబు - నిల్చియుండు ॥నా॥

1. తల్లిగర్భంబున - దసర సృజించితివి - ధరణి నన్ను = నీవు - తల్లికన్నను మిగుల - దయచేతఁ జూచితివి - తండ్రి నన్ను ॥నా॥

2. పాప కూపమునందుఁ - బడియుండఁగా నన్నుఁ - బారఁజూచి = చేయి - చాపి యేసునిద్వార - చక్కఁగాఁదెచ్చితివి - చాలు దేవ ॥నా॥

3. సుఖఃదుఖ కాలములు - శోధింపఁ - బంపుదువు - శోభాయుక్త = నాకు - సుఖముఁ గల్గజేయు - సొంపుగ వానిచే - స్థూల శక్తి ॥నా॥

4. సకల కాలంబులఁ - జక్కఁగ లోఁబడి - నన్నుతింతు = నన్ను - ఆకలంకునిగాఁ జేయు - మనుచు వేఁడుచునుందు - నధికాసక్తి ॥నా॥

- పులిపాక జగన్నాథము

## 14 యెహోవా నా కాపరి

(23-వ దావీదు కీర్తన)

రా - సావేరి రా - త్రిపుట

నాకేమి కొదువ - నాథుఁడుండ నిఁక = శ్రీకరుండగు దేవుఁడే నా - శ్రేష్ఠ పాలకుఁడు - నా - యేక రక్షకుఁడు గనుక ॥నాకేమి॥